క్లుప్తంగా

పోషకాహారం తీసుకోండి..

కె.కోటపాడు : గర్భిణులు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డల ఆరోగ్యం క్షేమదాయకంగా ఉంటుందని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి మాదంనాయుడు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. గర్భిణులు రక్తహీనత సమస్య లేకుండా బెల్లంతో కూడిన ఆహార పదార్థాలతో పాటు ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. ప్రసవాలను తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో జె.సన్యాసిరావు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం



కె.కోటపాడులో జీఎస్టీపై ప్రచారంలో శ్రీలక్ష్మి, సాంబశివరావు

కె.కోటపాడు : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ చార్జీలను తగ్గించడం వలన పలు నిత్యావసర, గృహోపకరణాలపై ధరలు తగ్గనున్నట్లు కె.కోటపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రచారాన్ని వైద్య సిబ్బంది, ఎంపీడీవో సాంబశివరావుతో కలిసి కె.కోటపాడులో గురువారం ఆమె ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. వ్యాపారులు తగ్గించిన జీఎస్టీ ధరలను అనుసరించి అమ్మకాలు చేయాలని శ్రీలక్ష్మి సూచించారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం

మాడుగుల రూరల్ : పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఒక మోస్తారుగా తీవ్రంగా ఎండ కాసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమైంది. వీరనారాయణం, జి. అగ్రహారం, చింతలూరు, గడబూరు, తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

కొండప్రాంతాల్లో డీఫారం రైతులకు పట్టాలిస్తాం..

మాడుగుల : మాడుగుల, రావికమతం మండలంలో కొండ ప్రాంతంలో సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందనవసరం లేదని, మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు అన్నారు. స్థానిక పీఆర్ వసతి గృహంలో విలేకరులతో ఆయన గురువారం మాట్లాడారు. కొప్పుకొండ, నాగాల్లకొండ ప్రాంతంలో డీఫారం భూములు సాగుచేస్తున్న 469 మంది రైతులకు ఐదవ విడతలో 2010, 11, 12 లలో కొంత మందికి పట్టాలు ఇవ్వడం జరిగిందని, మిగిలిన రైతులకు కూడా పట్టాలు అందజేయడానికి కృషి చేస్తానన్నారు. సాగులో ఉన్న భూములకు ఆన్‌లైన్ కూడా చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సన్యాసిరావు, రమేష్, ఉండూరు దేముడు పాల్గొన్నారు.

బాలికల హక్కులు తెలుసుకోవాలి



వడ్డాదిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మంగతాయారు

బుచ్చెయ్యపేట : బాలికలు తమ హక్కులు, విధులు, బాధ్యతలు గురించి తెలుసుకోవాలని ఐసీడీఎస్ పీఓ మంగతాయారు తెలిపారు. గురువారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మేజర్ పంచాయతీ వడ్డాది, మంగళాపురం, పెదమదీన, సీతయ్యపేట తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు లింగ వివక్షపై అవగాహన కల్పించారు. నేటి రోజుల్లో మగ, ఆడ ఇద్దరూ సమానమేనని తల్లిదండ్రులు అందరూ తమ పిల్లల్ని లింగ వివక్షతో చూడరాదన్నారు. బాలికలపై జరుగుతున్న దాడులను, మైనర్ వివాహాలను ప్రతి ఒక్కరూ ప్రతిఘటించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు రాధ, అమ్మాజీ, లక్ష్మి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల విజేతకు సన్మానం



మోహితను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మాడుగుల రూరల్ : సూపర్ జీఎస్టీ అనే అంశం మీద ఇటీవల కశింకోట హైస్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో కె.జె.పురం హైస్కూలు విద్యార్థిని కాళ్ల మోహిత ప్రథమ బహుమతి సాధించింది. ఈ విద్యార్థినిని గురువారం పాఠశాల ఆవరణలో అభినందించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌శర్మ, స్కూలు కమిటీ చైర్మన్ కర్రి సంతోష్‌కుమార్, దేశం మండల క్లస్టర్ ఇన్‌చార్జి విజయలక్ష్మి పాల్గొన్నారు.



అభిమానులను అడ్డుకుంటున్న రోప్ పార్టీ పోలీసులు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



భీమవరం వద్ద భద్రత ఏర్పాట్లపై సూచనలు ఇస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా



చోడవరం-అనకాపల్లి రోడ్డులో స్టాప్ బోర్డులు పెట్టిన పోలీసులు

ఆంక్షల నడుమ జనజాతర



మాడుగుల : ముకుందపురం వద్ద తనిఖీ



చెట్లు ఎక్కిన అభిమానులు



దేవరాపల్లి : పోలీసులు అడ్డగించడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అభిమాన నటుల ఫ్లెక్సీతో

జగనన్నకు బ్రహ్మరథం

- మాజీ సీఎం జగన్ పర్యటనకు పోటెత్తిన జనం
- మెడికల్ కళాశాల సందర్శనకు స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు
- అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- అయినా వెనుకడుగు వేయని వైనం
- అడ్డంకులు దాటుకుని వెల్లువెత్తిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నర్సీపట్నం, మాకవరపాలెం : వైఎస్సార్‌సీపీ అధినేత, జన నాయకుడు, మాజీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నాటి జిల్లా పర్యటన జనజాతరను తలపించింది. జగన్‌మోహన్‌రెడ్డి సబ్బవరం సమీపంలో జిల్లాలో అడుగుపెట్టింది మొదలు మాకవరపాలెం మండలం, భీమబోయినపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల నుంచి తిరిగి వెళ్ళేంత వరకు ప్రజలు ఎక్కడికక్కడ బ్రహ్మరథం పట్టారు. మెడికల్ కళాశాల సందర్శనకు అనూహ్య స్పందన లభించింది. పెద్ద ఎత్తున ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఉదయం 6 గంటలకే రావడం మొదలుపెట్టిన ప్రజలు అధినాయకుడు రాక ఆలస్యమైన తిరిగి వెళ్లేంత వరకు ఒపికతో ఉన్నారు. పోలీసులు ఎక్కడికక్కడ ప్రజలు, పార్టీ శ్రేణులు జగన్ పర్యటనకు వెళ్లకుండా చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేశారు. నర్సీపట్నం నుంచి మాకవరపాలెం వైపు వెళ్లే మార్గంతో పాటు కోటవురట్ల, కేడి పేట, చింతపల్లి, తుని తదితర రహదారులను దిగ్బంధించారు. ప్రతి చోటా బారికేడ్లను పెట్టి అభిమానులను అడ్డుకున్నారు. పోలీసులతో రవాణాశాఖ అధికారులు జత కలిసారు. ఆటోలు, ద్విచక్రవాహనాలపై భారీగా జరిమానాలు విధించారు. గుర్తింపు కార్డులు ఉన్న ఉద్యోగులను మాత్రమే ప్రయాణానికి అనుమతించారు. ఆర్టీసీ బస్సులను సైతం మెడికల్ కాలేజీ సమీపంలో నిలపకుండా చేశారు. సమాచార వ్యవస్థను స్తంభింపజేశారు. వైద్య కళాశాల పరిసరాల్లో సెల్‌ఫోన్ సిగ్నల్ నిలువరించారు. వైద్య కళాశాల చుట్టూ పోలీసులు ముళ్ల కంచెను ఏర్పాటు చేశారు. ఇలా ఎన్ని అడ్డంకులు సృష్టించినా అభిమాన సంద్రాన్ని అపలేకపోయారు. జగన్ వచ్చే సమయానికి ప్రజలు వెల్లువలా తరలివచ్చారు. ప్రధాన రహదారులు మొదలు పక్కమార్గాల్లో ప్రయాణించి గమ్యానికి చేరుకున్నారు. సాధారణ ప్రయాణికుల్లా ప్రజలు ఆర్టీసీ బస్సులు, బైక్‌లపై తరలివచ్చారు.

ఉప్పొంగిన అభిమాన జల్లులు..

శెట్టిపాలెం వద్ద నర్సీపట్నం నియోజకవర్గంలో భారీ క్యాన్వాయితో అడుగుపెట్టిన జగన్‌కు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నాయకత్వంలో అభిమానులు ఎదురెళ్లి ఘన స్వాగతం పలికారు. పోలీసులు అడ్డంకులే కాదు..ప్రకృతి అడ్డంకులను కూడా ప్రజలు పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి తాళ్లపాలెం చేరుకునే సరికి వర్షం కురిసింది. కాలేజీ ప్రాంతానికి వచ్చే వరకు వర్షం పడుతూనే ఉంది. చినుకులను కూడా లెక్కచేయకుండా ప్రజలు అలాగే ఉన్నారు. జగన్ కళాశాలకు చేరుకునే సమయానికి అభిమానులు పోటెత్తడంతో పోలీసులు చేతులెత్తేశారు. దీంతో ప్రజల ఉత్సాహం ఉరకలెత్తింది. చెట్లు ఎక్కి దారిపొడుగునా భవనాలు అభిమాన నాయకుడిని తిలకించి, అభివాదం చేశారు. జగన్ కూడా ఉత్సాహంగా చేతులు ఊపి ప్రజలను పలకరించారు. సినీ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, మహేష్‌బాబు ఫొటోలతో కూడా జగన్ ఫ్లెక్సీలతో యువకులు కేరింతలు కొట్టారు. ఈ పర్యటనలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల సన్యాసిపాత్రుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి రుత్తల యర్రాపాత్రుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, గజ్జలపు మణికుమారి, సాగిన లక్ష్మణ్‌మూర్తి, రుత్తల సర్వేశ్వరరావు, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, అప్పలనర్స, పెట్ల భద్రాచలం, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకాశివ, మండల పార్టీ అధ్యక్షులు ఫాణీశాంతరావు, నాగేశ్వరరావు, చిటికెల రమణ, శానపతి వెంకటరత్నం, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు గోవిందరావు, విద్యార్థి విభాగం నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ పాల్గొన్నారు.

భద్రత ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ

గొలుగొండ : మాకవరపాలెం ప్రాంతంలో ఉన్న మెడికల్ కళాశాలను పరిశీలించడానికి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భద్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు జారీ చేశారు. నర్సీపట్నం-తాళ్లపాలెం రోడ్డు మార్గం మధ్యలో ఉన్న భీమవరం వద్ద జనం అధికంగా ఉండడంతో అక్కడ భద్రత ఏర్పాట్లు ఎస్పీ పరిశీలించారు. పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలో రాజయ్యపాలెం మత్స్యకారులు అధికంగా ఇక్కడికి తరలివచ్చారు. అక్కడ బల్క్ డ్రగ్ పార్కు వల్ల నష్టం జరుగుతుందని దీనిపై మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం ఇవ్వడానికి మత్స్యకారులు వేచి ఉన్నారు.

గోవాడ ఫ్యాక్టరీని ఆదుకోవాలి..

బుచ్చెయ్యపేట : మాకవరపాలెంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ పరిశీలనకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని జెడ్పీటీసీ రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తదితరులు కలిసి గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలని వినతి పత్రం అందించారు. తాళ్లపాలెం వద్ద జగనన్నను కలిసి మన ప్రభుత్వంలో రూ. 90 కోట్లు నిధులు తెచ్చి గోవాడ ఫ్యాక్టరీని ఆదుకోగా ఇపుడు టీడీపీ ప్రభుత్వం వచ్చి గోవాడ సుగర్ ఫ్యాక్టరీని మూతపడేలా చేసి 25 వేల మంది రైతులు రోడ్డున పడేలా చేస్తున్నారని, గోవాడ ఫ్యాక్టరీని ఆదుకోవాలని జగనన్నకు వినతి పత్రం అందించారు.

పోలీసుల తీరుపై జనం అసంతృప్తి

చోడవరం : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూసేందుకు వెళుతున్న ప్రజలను, వైఎస్సార్‌సీపీ అభిమానులు, నాయకులను అడుగడుగునా పోలీసులు అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ ప్రత్యేకంగా పోలీసు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి గురువారం ఉదయం నుంచి నిలువరించే ప్రయత్నాలు చేశారు. చోడవరం - అనకాపల్లి, చోడవరం- నర్సీపట్నం, వెళ్లే దారుల్లో పలుచోట్ల ప్రత్యేక చెక్‌పోస్టులు తాత్కాలికంగా ఏర్పాటు చేశారు.

రోలుగుంట : జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ, ఎంపీపీ శ్రీనివాసరావు, మాజీ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ స్టేట్ డైరెక్టర్ టి.వి.రమణ, పార్టీ నాయకులు దోసపర్తి రాజు, పోతల రాజశేఖర్, మద్దు అప్పలనాయుడు తదితరులతో పాటు పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో స్వచ్ఛందంగా జగన్ పర్యటనకు తరలివెళ్లారు. వీరిని నిండుగొండ కూడలిలో ఎస్ఐ రామకృష్ణారావు కొంతసేపు అడ్డగించారు. దీంతో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ ప్రతినిధి పోతల లక్ష్మీ శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు.

బుచ్చెయ్యపేట : జననేత జగనన్న పర్యటనకు వెళ్లకుండా జెడ్పీటీసీ దొండా రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కె అచ్చింనాయుడు,వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి,గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనర్దనరావు తదితరులను పోలీసులు అడ్డుకున్నారు. వారు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

మాడుగుల/మాడుగుల రూరల్ : మండలంలో తాటిపర్తి, ఘాట్‌రోడ్ జంక్షన్, విజేపురం శివారు బుడ్డిబంద మూడురోడ్ల కూడలి వద్ద గురువారం పోలీసులు పహరా కాశారు. బైక్‌లు, ఆటోలు, జీపులు, కారుల్లో వెళ్తున్న వారిని అడ్డుకుని వెనక్కి పంపించారు. మాడుగుల ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్‌తో పాటు కొంత మంది వైఎస్సార్‌సీపీ నాయకులను రాజాం వద్ద సుమారు గంటసేపు అడ్డుకున్నారు. మాజీ ఎంపీపీ రామధర్మజ, మాడుగుల వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావును వడ్డాది జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. చోడవరం సీడీసీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సుంకర శ్రీనివాసరావును అనకాపల్లి సమీపంలో పోలీసులు అడ్డగించారు.

చీడికాడ : జగన్ మీటింగ్‌కు అనుమతి లేదు..మీరు వెళ్లకూడదు అంటూ పోలీసు అధికారులు గ్రామాల్లో గల చిన్నస్థాయి కార్యకర్తలు, నేతలకు హెచ్చరికలు చేసినట్టు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. జేబీపురం కాటా వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి తనిఖీలు పేరిట జనాన్ని అడ్డుకోవడం శోచనీయమన్నారు.

దేవరాపల్లి : నర్సీపట్నం మెడికల్ కాలేజీ సందర్శనకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు పయనమైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులను చౌడువాడ అడ్డుకొని గంటల తరబడి నిలిపివేశారు. రెండు రోజులుగా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులకు ఫోన్లు చేసి, మరికొందర్ని పోలీస్‌స్టేషన్‌కు రప్పించి మాజీ సీఎం జగన్ పర్యటనకు వెళ్లొద్దంటూ హెచ్చరికలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలం నుంచి తరలివెళ్లిన వారిలో ఎ.కొత్తపల్లి సర్పంచ్ సత్యవెంకటరమణ, సీనియర్ నాయకులు డా. సింహాచలంనాయుడు, కె.వి.రమణ, లలితానాయుడు, దాసరి గోపి, బండారు దేముడునాయుడు, తమ్ముునాయుడు ఉన్నారు.

కె.కోటపాడు : మాజీ డిప్యూటీ సీఎం, పొలిటికల్ అడ్వజయిరీ కమిటీ మెంబర్ బూడి ముత్యాలనాయుడు పిలుపు మేరకు జగన్‌ను కలవడానికి అనకాపల్లిలో కొత్తూరు ప్రాంతానికి చేరుకునేందుకు స్వచ్ఛందంగా తరలివెళ్తున్న కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్, ఎంపీటీసీలు, అభిమానులను మండలంలో చౌడువాడ, సూదివలస జంక్షన్‌ల వద్ద కె.కోటపాడు,ఎ.కోడూరు పోలీసులు నిలువరించారు. పలువురు ప్రత్నామ్నాయ మార్గాలలో అనకాపల్లి ప్రాంతంలో కొత్తూరుకు చేరుకున్నారు.

మా సమస్య విన్నారు...



మాది నక్కపల్లి మండలం, రామయ్యపేట గ్రామం. జగన్‌మోహన్‌రెడ్డిని కలుస్తామా లేదోనని ఆందోళన చెందాను. ఆఖరికి కోటపాడు మండలం జి.భీమవరం గ్రామంలో కాన్వాయ్ ఆపి మా సమస్య విన్నారు. మా ప్రాంతంలో కూటమి ప్రభుత్వం మొండిగా పరిశ్రమలకు చేస్తున్న భూసేకరణ అడ్డుకోమన్నాం.

-పి.పైడితల్లి, నక్కపల్లి మండలం

పోలీసుల తీరు దారుణం



మా గ్రామ సమీపంలో జెడ్పీటీసీ రాంబాబును పోలీసులు అడ్డేసారు. దానిని చూసి నేను కూడా జగన్ సార్‌ను చూడలేనని ఆందోళన చెందాను. గెడ్డలోంచి కాలువ గట్టుపై బురద అంటుకున్నా పట్టించుకోకుండా అడ్డదారిలో కన్నూరిపాలెం గ్రామానికి చేరుకున్నాను. అక్కడ రోడ్డు షోలో జగన్‌సార్‌ను చూశాను. ఆనందంగా ఉంది.

ఎం.రాజు, ఫంగడి, బుచ్చెయ్యపేట మండలం



కె.కోటపాడు : చౌడువాడలో సాయి ప్రసాద్, కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు



బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, రాజాం రోడ్డులో నిరసన తెలుపుతున్న జెడ్పీటీసీ రాంబాబు



చీడికాడ : జేబీపురం కాటా వద్ద పోలీసుల తనిఖీలను ఖండిస్తున్న రాజుబాబు



బుచ్చెయ్యపేట మండలం నుంచి జగనన్నను చూసేందుకు బైక్‌లపై వెళ్తున్న నాయకులు



బుచ్చెయ్యపేట : రాజాం,మల్లాం రోడ్డులో వైస్ ఎంపీపీని అడ్డుకుంటున్న పోలీసులు

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



బుచ్చింపేటలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



దొండపూడి హైస్కూల్లో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రోలుగుంట : మండలంలో రోలుగుంట, బుచ్చింపేట సెక్టార్ల పరిధిలో గల పలు పాఠశాలల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఆయా సూపర్‌వైజర్లు హైమా, షేక్ జవహర్ ఉన్నీసా బేగం నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ వివక్ష, బాల్య వివాహాల వల్ల నష్టాలపై వ్యాస రచన పోటీలు కొవ్వూరు, బుచ్చింపేట, రోలుగుంట, కుసుర్లపూడి తదితర గ్రామాల్లో గల హైస్కూళ్లలో నిర్వహించారు. విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

రావికమతం: ఈ నెల 11న జరిగే అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా రావికమతం ఐసీడీఎస్ అధికారులు గురువారం పాఠశాలలో బాల్య వివాహాలు, లింగ వివక్షపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. దొండపూడి, మేడివాడ, రావికమతం జెడ్పీ హైస్కూలు, గర్నికం కేజీబీవీ, మరువాక ఏపీ మోడల్ స్కూల్, గ్రామ సచివాలయాల పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలల్లోని, ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే బాలికలకు, అంగన్‌వాడీ కార్యకర్తలు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీడీపీవో మంగతాయారు, సూపర్‌వైజర్ రాజరాజేశ్వరి తెలిపారు. బాల్య వివాహాలు, లింగ వివక్షపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహ బహుమతులు అందజేసినట్టు తెలిపారు.

బియ్యం లారీ బోల్తా..



రోడ్డుకు అడ్డంగా బోల్తాపడ్డ లారీ

మాకవరపాలెం: రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని బియ్యం లారీ బోల్తాపడింది. విశాఖ నుంచి చింతపల్లికి రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ బుధవారం అర్ధరాత్రి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు వద్దకు వచ్చే సరికి డివైడర్‌ను ఢీకొని రోడ్డుకు అడ్డంగా బోల్తాపడింది. ఈ సంఘనలో ఎవరికీ లాంటి ప్రమాదం జరగలేదు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. రేడియం స్టికర్లు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ కారణంగా రోడ్డుమధ్యలో డివైడర్లు కనిపించలేదని దీంతో ఢీకొట్టినట్టు డ్రైవర్ తెలిపాడు. లారీ రోడ్డుపైనే బోల్తా పడింది. రోడ్డుకు పక్కగా బోల్తాపడి ఉంటే దుకాణాలు ధ్వంసం అయ్యేవి, బోల్తాపడ్డ లారీలో ఉన్న బియ్యం బస్తాలను వేరొక లారీలోకి లోడ్ చేసి, లారీని తొలగించారు.

నేత్ర సంరక్షణపై అవగాహన



దేవరాపల్లి పీహెచ్‌సీలో కంటి ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డా. ప్రశాంత్



దిబ్బిడిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రాజు

బుచ్చెయ్యపేట : ప్రతి ఒక్కరూ ప్రకృతి అందాలను తమ కళ్లతో అస్వాదించాలని ఐఈడీ ప్రత్యేక ఉపాధ్యాయుడు అప్పలరాజు తెలిపారు. గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా దిబ్బిడి స్కూల్లో విద్యార్థులకు నేత్ర సంరక్షణ, నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నతనం నుండి ప్రతి ఒక్కరూ తమ కళ్లను సంరక్షించుకుంటే దృష్టి లోపం రాదన్నారు. మేనరికం, చిన్న తనంలో వివాహాలు చేయడం మానుకుంటే దృష్టి లోపం రాదన్నారు. అలాగే సెల్‌ఫోన్ ఎక్కువ సేపు చూడడం, కంప్యూటర్ల ముందు, ఎక్కువ వెలుతురులో ఎక్కువ సేపు గడపడం ద్వారా కళ్లు అలిసిపోయి కంటిచూపు మందగిస్తుందన్నారు. అందువల్ల తగు జాగ్రత్తలు పాటించి కంటిచూపు కాపాడుకోవాలన్నారు.

దేవరాపల్లి: కంటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రశాంత్ సూచించారు. దేవరాపల్లి పీహెచ్‌సీలో ప్రపంచ దృష్టి దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కంటి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యం వహిస్తే దృష్టిలోపానికి గురికావాల్సి వస్తుందని వివరించారు. కంటి సమస్యలు ఉంటే అలసత్వం ప్రదర్శించకుండా వెంటనే కంటి వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి కె.భవానీ, హెల్త్ సూపర్‌వైజర్ కె.పుష్పరాజ్, స్టాఫ్ నర్స్ రాణి, ఏఎన్ఎం భీమాలమ్మ తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బోధనేతర విధుల బహిష్కరణ



ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు

మాకవరపాలెం : బోధనేతర విధుల నుంచి తప్పించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ప్యాప్టో) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 10 నుంచి పాఠశాలల్లో బోధనేతర పనులను బహిష్కరిస్తామంటూ ఎంఈవో అచ్యుతరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరామ్మూర్తి, మల్లేశలింగం మాట్లాడుతూ నిత్యం పాఠశాలల్లో విద్యార్థులకు బోధన చేయడం కంటే బోధనేతర పనులు అధికంగా ఉంటున్నాయన్నారు. ఈ కారణంగా విద్యార్థులకు చదువు చెప్పేందుకు సమయం చాలడం లేదన్నారు. శుక్రవారం నుంచి బోధనేతర విధులను బహిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిలర్ ఆర్.వి.దొర, ఇతర ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రోబోటిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి



విద్యార్థులకు రోబోటిక్స్ ఉపయోగాలను వివరిస్తున్న హెచ్‌ఎం శేఖర్

కె.కోటపాడు : ప్రస్తుత కంప్యూటర్ యుగంలో మానవ మేధస్సుతో పాటు రోబోటిక్స్ వల్ల కలిగే ఉపయోగాలు, ప్రయోజనాలను తెలుసుకోవాలని ఎ.కోడూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎ.శేఖర్ తెలిపారు. పాఠశాలలో 7,8,9 తరగతుల విద్యార్థులకు సృజనవాణి స్వచ్ఛంద సంస్థ సభ్యులు రోబో విధానంతో పాటు వినియోగంపై అవగాహన కార్యక్రమం జరిపారు. రోబోటిక్స్‌పై విద్యార్థులకు రెండు రోజుల పాటు శిక్షణను ఇవ్వనున్నట్టు స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వాసు, భాగ్య తెలిపారు. మనిషి చేసే పనులు కుడా రోబో చేయగలదని వీరు విద్యార్థులకు వివరించారు. ప్రమాదాల సమయాల్లో మనుషులు వెళ్ళ లేని ప్రాంతాలకు కుడా రోబోలు వెళ్లి లక్ష్యాలను పూర్తి చేయగలవని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్రెడ్డి బాబూరావు, ప్రసాద్, పిఈటీ చిట్టి ప్రసాద్, లెక్కల మధు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం, పాయకరావుపేట : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com